## క్లుప్తంగా

### సమస్యల పరిష్కారానికి గ్రామసభ



సభలో అధికారులు, ప్రజాప్రతినిధులు

**జిన్నారం(పటాన్‌చెరు):** గుమ్మడిదల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమస్యల పరిష్కారానికి బుధవారం గ్రామసభ నిర్వహించారు. దీనికి జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో మహిళా భవనాన్ని నిర్మించాలని కోరుతూ డ్వాక్రా మహిళలు ఆయనకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

### కులమతాలకు ప్రతీక ఉర్సు



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు:** కులమతాలకు ప్రతీక ఉర్సు అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరులోని హజ్రత్ సయ్యద్ మురాద్ అలీ షా దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఉర్సులో పాల్గొంటున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, ముస్లిం మత పెద్దలు లియాకత్ అలీ, అజ్మత్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

### క్రైస్తవుల అభివృద్ధికి కృషి



పావురాన్ని వదులుతున్న ఎమ్మెల్యే

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** క్రైస్తవుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో క్రిస్టియన్ మైనార్టీ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని క్రైస్తవులకు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న పర్సు అందజేత

**పటాన్‌చెరు టౌన్:** ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు బుధవారం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి...పటాన్‌చెరు బస్టాండ్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులుకు బస్టాండ్ సమీపంలో ఓ పర్సు దొరికింది. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ ఆ వ్యక్తి ఫోన్ నెంబర్‌ను బ్యాంక్ కార్డు, ఆధార్ ఆధారంగా సేకరించి, ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో గణేశ్‌కు పర్సు అందజేయడంతో అతను ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులకు కృతజ్ఞతలు తెలిపారు.

### కురుమసంఘం సమావేశం

**మునిపల్లి(అందోల్):** మునిపల్లి మండల కురుమసంఘం నాయకులు కంకోల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. అంతకు ముందు కురుమ సంఘం నాయకులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దలోడి మాజీ ఎంపీటీసీ సభ్యులు వెంకటేశం, నియోజకవర్గ కార్యదర్శి ఒగ్గు మోహన్, అల్లాపూరం శంకరయ్య, పెద్దలోడి మొగులయ్య, సాయికుమార్, తాటిపల్లి మల్లేశం తదితరులున్నారు.

### వివాహానికి ఆర్థిక సాయం

**జిన్నారం(పటాన్‌చెరు):** గడ్డపోతారం గ్రామానికి చెందిన శివకుమార్ కుమార్తె వివాహానికి పులిగిళ్ల ఫౌండేషన్ అధినేత ప్రకాశ్‌చారి, యువజన నాయకులు శ్రీనివాస్‌చారిలు బుధవారం రూ.13వేల సాయం అందించారు. ప్రకాశ్‌చారికి శివకుమార్ కృతజ్ఞలు చెప్పారు.

### నేడు సాయిబాబా ఆలయంలో పూజలు

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** ఇశ్రితాబాద్ శివారులోనినిని సాయిబాబా ఆలయంలో గురువారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### అట్టహాసంగా వార్షికోత్సవం

**నారాయణఖేడ్:** ఖేడ్ మండలంలోని జి హుక్రానలో హరిహర క్షేత్ర వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అభిషేకం, అంకరణ, హారతి నిర్వహించారు. సాయంత్రం కరణ్ గజేంద్ర భారతి మహరాజ్ ఆధ్వర్యంలో అవదూత్ మహరాజ్ ద్వారా కీర్తన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

# హైవేపై వరుస ప్రమాదాలు

- మూలమలుపు వద్ద తరచూ సంఘటనలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



మూల మలుపు వద్ద బోల్తా పడ్డ ఓ ఆటో (ఫైల్)

**జిన్నారం(పటాన్‌చెరు):** మెదక్–హైదరాబాద్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతినిత్యం ప్రమాదాలు సంభవిస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు మృతి చెందుతున్నారు. కొందరు గాయాలపాలవుతున్నారు. దీంతో ప్రమాదాలు జరగకుండా రోడ్డు వెడల్పు చేసి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. మంబాపూర్, గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం గ్రామాల మీదుగా మెదక్– హైదరాబాద్ 765డి జాతీయ రహదారి ఉంది. దోమడుగు గ్రామం వద్ద మూల మలుపు ఉంది. పక్కనే ఇళ్లు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడి నుంచి వాహనాలు వెళ్లేందుకు రోడ్డు ఇరుకుగా ఉండడం ప్రమాదాలకు మరో కారణం. మూడు నెలల్లోనే ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. 20మందికి పైగా వాహనదారులు గాయపడ్డారు. ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్న మలుపు వద్ద భారీ వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఆటోలు బోర్లా పడుతున్నాయి. దీంతో ప్రతి నిత్యం ఏదోక ప్రమాదం సంభవిస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. మూల మలుపు వద్ద బారికేడ్లను, స్పీడ్ బ్రేకర్లను, రోడ్డు వెడల్పు చేయాలని వారు కోరుతున్నారు.

#### అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు

రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నా అధికారులు ఆ వైపు చూడడం లేదు. మూల మలుపు ఎక్కువగా ఉండటంతో వాహనాలు బోర్లా పడుతుండడం, ప్రమాదాలు సంభవించడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – గోవర్ధన్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు, దోమడుగు

#### చర్యలు తీసుకుంటున్నాం

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నాం. దోమడుగులోని ప్రధాన రహదారిపై మూలమలుపు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశాం. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. – విజయకృష్ణ, ఎస్ఐ గుమ్మడిదల

# నట్టల నివారణ మందులు పంపిణీ

**ఝరాసంగం(జహీరాబాద్):** గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ సునీల్‌దత్త్ పేర్కొన్నారు. బుధవారం ఝరాసంగం పశువైద్యశాల ఆవరణలో పశువైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పశుకాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శివకుమార్, శోభారాణి, పాల్గొన్నారు.

**జిన్నారం(పటాన్‌చెరు):** గ్రామాల్లోని గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉండాలంటే నట్టల నివారణ మందులను తప్పక వేయించాలని గుమ్మడిదల జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ సూచించారు. బొంతపల్లిలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో నట్టల నివారణ మందులను వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నాగేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



జిన్నారం(పటాన్‌చెరు):మందు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ తదితరులు

**పటాన్‌చెరు టౌన్:** పశుపోషకులు జీవాలకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి శైలేంద్ర జైస్వాల్ అన్నారు. రుద్రారంలో నిర్వహించిన పశువైద్యశిబిరంలో నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీకాంత్, శ్రావణ్, సులోచన, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్(జహీరాబాద్):** జీవాలకు వ్యాధులు సోకకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకుంటుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, న్యాల్‌కల్ పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి అజింక్యా పేర్కొన్నారు. సిబ్బంది ఎంఏ ఘనీ, రాజయ్య, రవీందర్‌రెడ్డి, రహీం తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం



ప్రారంభిస్తున్న ఈడీ వరదరాజన్

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని బెల్ జనరల్ ఆస్పత్రిలో బుధవారం కాంట్రాక్ట్ కార్మికులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఈడి వరదరాజన్ ప్రారంభించారు. కాంట్రాక్ట్ కార్మికులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బెల్ జనరల్ ఆసుపత్రి సీఎంఒ భీతిక, ఎంజీఎం లీల తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మంపల్లిలో స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

**మునిపల్లి(అందోల్):** ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. బుధవారం ఆయా తరగతుల విద్యార్థులకు తోటి విద్యార్థులు పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎండి ఖమ్రోద్దీన్, ఉపాధ్యాయులు ప్రీతి, గోపాల్, పీటీఎస్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### మిత్రుడి కుమారుడికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న దృశ్యం

**జోగిపేట(అందోల్):** స్నేహితుడి కుమారుడు ప్రమాదంలో గాయపడడంతో తోటి స్నేహితులంతా ఆర్థిక సాయం చేశారు. అందోల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మాణిక్యం కుమారుడు రోహిత్ కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వెన్నెముక దెబ్బతింది. దీంతో మాణిక్యం కుమారుడిని 1993 ఎస్ఎస్‌సీ బ్యాచ్ మిత్ర బృందానికి చెందిన వడ్ల శ్రీనివాస్ రూ.51వేలను బుధవారం అందజేశారు.

# దాడిని నిరసిస్తూ విధుల బహిష్కరణ



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

**నారాయణఖేడ్:** ఓ న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఖేడ్‌లో న్యాయవాదులు బుధవారం జూనియర్ సివిల్‌జడ్జీ కోర్టు బార్ అసోసియేషన్ అడ్‌హాక్‌కమిటీ బాధ్యులు సంగమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోర్టు ఎదుట నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బోజిరెడ్డి, కిషన్‌రావు, నర్సింహారావు, అమరేశ్వరి, విష్ణువర్ధన్‌రెడ్డి, అలిగే జీవన్ కుమార్ పాల్గొన్నారు.

**న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలి**

**సంగారెడ్డి టౌన్:** న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని సంగారెడ్డి బార్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సంగారెడ్డిలో జిల్లా న్యాయవాది సురేందర్‌పై జరిగిన దాడికి నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఆంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లోనే నగల దుకాణం

ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు

**జహీరాబాద్:** జహీరాబాద్‌లో ప్రముఖ వ్యాపారులు అల్లాడి వీరేశం, అల్లాడి నర్సింహులు ఏర్పాటు చేసుకున్న శ్రీస్వర్ణం జ్యువెల్లర్ దుకాణాన్ని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ పెళ్లిళ్లు, శుభ కార్యాలకు అవసరమైన ఆభరణాలు కొనుగోలు చేయాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదన్నారు. అల్లాడి బ్రదర్స్ జహీరాబాద్‌లో కొత్త డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెల్లర్‌ను ప్రారంభించడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే బాధ తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ గ్రూప్ అధినేత ఘన్‌శ్యాం దులాకియా, బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహరాజ్, కిస్నా జీఎం మహేష్ గంధని, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, సంజీవ కై మర్, బీఆర్ఎస్ నాయకులు ఎం.డి.తన్వీర్, జి.గుండప్ప, కిషన్‌రావు పవార్, పెంటారెడ్డి, మంకాల్ సుభాష్, మురళీకృష్ణాగౌడ్, యాకూబ్, శ్రీకాంత్‌రెడ్డి, వైజ్యనాథ్, మాణిక్యమ్మ, నామ రవికిరణ్, మోతీరాం పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## సంక్షిప్త వార్తలు

**◆ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

**నారాయణఖేడ్:** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖేడ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లకు మీ ఎస్‌బీఐ యోనో అకౌంట్ సస్పెండ్ అయ్యిందని, మీ పాన్‌కార్డుతో అప్‌డేట్ చేసుకోవాలని, వాటికి సంబంధించిన లింకును పంపుతూ షార్ట్ మెస్సెజ్‌లు వస్తున్నాయని తెలిపారు. నమ్మి లింకును ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుందన్నారు. గుర్తుతెలియని నెంబర్లు, వ్యక్తుల నుంచి షార్ట్ మెస్సెజెస్ వస్తే లింకులను ఓపెన్ చేయకూడదని ఆయన సూచించారు.

**◆ 28 మందికి కోవిడ్ టెస్టులు**

**పటాన్‌చెరు టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి . బుధవారం 28 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 16 మందికి నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

**◆ దరఖాస్తుల ఆహ్వానం**

**పటాన్‌చెరు టౌన్:** పెద్దకంజర్ల గ్రామ సమీపంలోని గిరిజన డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం చేపడుతున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ కళ్యాణి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలతలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ, నెట్, అర్హత గల అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జువాలజీ-1, కంప్యూటర్ సైన్స్-2, ఇంగ్లీష్-1, మ్యాథ్స్-1, బోటనీ-1 ఖాళీలు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 99129 34830, 90000 49142లపై సంప్రదించాలని తెలిపారు.

**◆ పార్కుల అభివృద్ధికి కృషి**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ బాలవిహార్ పార్కును అధికారులతో ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కును రూ.20 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు.

**◆ రేపటి నుంచి హనుమాన్ దీక్షలు**

**నారాయణఖేడ్:** నారాయణఖేడ్ మండలం కొండాపూర్‌లోని చారిత్రాత్మక హనుమాన్ ఆలయ ఆవరణలో శుక్రవారం నుంచి మండల దీక్షలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ పీఠాధిపతి, అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్ దీక్షాధారణ చేయిస్తారని చెప్పారు. దీక్షలు తీసుకునే భక్తులు ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

**◆ కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని వినతి**

**సదాశివపేట(సంగారెడ్డి):** రహమత్‌నగర్ కాలనీలో కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ వాసులు బుధవారం మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహమత్‌నగర్ కాలనిలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని, ప్రజలు భయాభ్రాంతులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి ఎయిటెల్ టవర్‌ను తొలగించడంతో కుక్కల బెడదను నివారించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

**◆ ఘనంగా ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

**వట్‌పల్లి(అందోల్):** షాద్‌నగర్(గట్‌పల్లి)లో ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం విగ్రహ ఊరేగింపు, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ప్రధాన కలశ స్థాపన, హోమం, విగ్రహ ప్రతిష్ఠా, పుణ్యాహవచనము, మంత్రదేవత, ఆవాహనము, బోనాలు ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి.రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, మహిపాల్‌రెడ్డి, గొల్ల విష్ణు, సంగమేశ్వర్, కిష్టయ్య పాల్గొన్నారు.

**◆ పాటి పూజలకు హాజరైన దామోదర**

**పటాన్‌చెరు:** పాటి గ్రామంలో జరిగిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీలు గడ్డం శ్రీశైలం, సుధాకర్ గౌడ్, సునీత గోపాల్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల నిర్మాణాలకు సహకరిస్తాం

**పటాన్‌చెరు:** పటాన్‌చెరు నియోజకవర్గంలో దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పాటి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ ముఖద్వారంలో నిర్మించిన స్వాగత తోరణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. గొర్రె పిల్ల, గొంగడి కప్పి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేశ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచులు స్వామి గౌడ్, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**పటాన్‌చెరు టౌన్:** దేవాలయాల నిర్మాణాలకు సహకరిస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం పాటి గ్రామంలో నిర్వహించిన మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో దేవాలయాలకు, ఉత్సవాలకు పూర్వవైభవం చోటుచేసుకుందన్నారు. మల్లికార్జున స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. అనంతరం నీలం మధు ముదిరాజ్‌ను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ గోపాల్ యాదవ్, మాజీ సర్పంచ్ రాములు యాదవ్, వార్డు సభ్యులు యాదయ్య, గోపాల్, లక్ష్మయ్య, యాదగిరి, కరుణాకర్, సాయి, సంతోష్, సతీష్, రాకేష్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు:** అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇంద్రేశం గ్రామ పరిధిలోని శ్రీకాకుళం సంక్షేమ సంఘం భవన నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో వివిధ జిల్లాల ప్రజలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వారందరినీ కన్నబిడ్డల వలె చూసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శ్రీకాకుళం వాసులకు 450 గజాల స్థలాన్ని ఏర్పాటు చేసి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, సర్పంచ్ నర్సింలు, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఉపసర్పంచ్ బండి శంకర్, సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం బీహెచ్‌ఈఎల్‌లో ఏర్పాటు చేసిన ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా మహాసభలకు మాజీ రాష్ట్ర శాసనమండలి ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులందరికీ పెన్షన్ అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పెన్షనర్ల సంక్షేమానికి రూ.5 లక్షలు విరాళం ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా రూ.5లక్షల విరాళాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్పొరేటర్లు వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి, బూరుగడ్డ పుష్ప నగేశ్ పాల్గొన్నారు.

# శిక్ష పడ్డ విషయం మరిచిపోయావా?

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆశిష్ గౌడ్

**పటాన్‌చెరు టౌన్:** గతంలో పారిశ్రామికవాడలో ఐలా చైర్మన్‌ను డబ్బుల కోసం బెదిరించిన కేసులో రెండున్నర సంవత్సరాలు శిక్ష పడ్డ విషయం మరిచిపోయావా ఎమ్మెల్యే.. మాపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కుమారుడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆశిష్ గౌడ్ అన్నారు. బుధవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తన గొయ్యి తాను తవ్వుకుంటూ విమర్శల పాలవుతున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం నన్ను ఓడించడానికి మంత్రి సహకారంతో రూ.13 కోట్లు ఖర్చు చేయించి గెలిచారని ఆరోపించారు. ఎమ్మెల్యే, అతని సోదరుడు, ఒక పోలీస్ ఆఫీసర్ కలిసి నాపై అక్రమ కేసులు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మీ ఆగడాలపై త్వరలోనే డీజీపీకి ఫిర్యాదు చేస్తానన్నారు. ఎల్లమ్మ గుడి, సాయిబాబా గుళ్లను గతంలో ఎండోమెంట్‌లో కలవడానికి ప్రయత్నం చేశామని, కానీ ప్రభుత్వం ఆదాయం తక్కువగా ఉందని తీసుకోలేదన్నారు. తనకు, తమ కుటుంబ సభ్యులకు, కార్యకర్తలకు ఎలాంటి హాని జరిగినా పూర్తి బాధ్యత ఎమ్మెల్యేదే అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నరేశ్ ముదిరాజ్, నడిమిటి కృష్ణ, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆశిష్ గౌడ్

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సిద్ధన్న



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** సదాశివపేట కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షుడిగా ఎల్లారం గ్రామానికి చెందిన చాట్ల సిద్ధన్న నియామకమయ్యారు. బుధవారం నియామక పత్రాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అందజేశారు. మండల కమిటీని గడిల రాంరెడ్డి అధ్వర్యంలో ఎన్నుకున్నారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా దుర్గం బోయిన కృష్ణ(వెంకట పూర్), ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా యాదయ్య(చందాపూర్), ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్(తంగడ పల్లి), మహిళ కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా మమత(మద్ది కుంట), కిసాన్ సెల్ అధ్యక్షుడిగా దశరథ్(కోనా పూర్), సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మోహన్(నాగ్సాన్ పల్లి), యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చారి(ఆత్మకూర్), మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా శాబొద్దీన్(మెలిగిరి పెట్), టీజేఆర్ యువసేన మండల అధ్యక్షుడిగా చింటు గౌడ్(నంది కంది) నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం కోసమే పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గడిల రాంరెడ్డి, సత్యనారాయణ, చోటు, చిరు, భాస్కర్, రవి, ఎంపీటీసీ సభ్యులు ఒగ్గు శ్రీనివాస్, మమత, సర్పంచ్‌లు భూపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డుపై పారుతున్న మురుగు

**కంది(సంగారెడ్డి):** కందిలో జాతీయ రహదారిపై మురుగు నీరు పారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఈ మురుగు నీటితో ప్రజలు, వాహనా దారులు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా ఏర్పడిన కాలనీల్లో ఎక్కువశాతం ఇండ్లు అనుమతులు లేకుండా నిర్మించుకున్నారు. దీంతో మురికి కాలువల నిర్మాణం సక్రమంగా జరగలేదు. అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఇండ్లనుంచి వెలువడే మురుగునీరు జాతీయ రహదారిపై పారుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ అధికారులు కాలువలు ఏర్పాటు చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.



జాతీయరహదారిపై పారుతున్న మురుగు నీరు